PRGI RNI : TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

Published From : Rangareddy VOLUME : 01 Issue : 247 Tuesday 25-08-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal–Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

విలేకరులు కావలెను!

మా వార్త సంధ్య పత్రిక మరియు వార్త సంధ్య టీవీ కోసం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
గ్రేటర్ హైదరాబాద్ మరియు రంగారెడ్డి
జిల్లాలోని అన్ని డివిజన్, మండలాలలో కావలెను.

విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక, రాజకీయ మరియు ప్రజా సమస్యలపై పరిశోధనాత్మక వార్తల సేకరణ కొరకు మండల స్థాయి విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

7369122101 vaarthasadhya@gmail.com

9951751662 epaper.vaarthasadhya.com

13-22/43, Plot No:203, VV Nagar Colony, Gaddiannaram, Ranga Reddy Dist. - Hyderabad, Telangana 500060

## పాలిటెక్నిక్ విద్యా ఆధునీకరణకు తెలంగాణ ప్రభుత్వం హై లెవల్ కమిటీ

**డిమాండ్లపై ప్రభు విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, ఇతర వర్గాల ప్రయోజనాలపై సమీక్ష**

**30 రోజుల్లో ప్రభుత్వానికి సిఫారసులు సమర్పించనున్న కమిటీ త్వం సానుకూలం..**



**హైదరాబాద్, ఆగస్టు 24 (వార్త సంధ్య):** తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను ఆధునీకరించడంతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, ఇతర భాగస్వాముల విద్యా, ఉద్యోగ, వృత్తిపరమైన ప్రయోజనాలను పరిరక్షించే అంశాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హై లెవల్ కమిటీని ఏర్పాటు చేసింది.

ఈ మేరకు సాధారణ పరిపాలన (స్పెషల్ ఏ) శాఖ ఆగస్టు 24, 2026న జి.ఓ.ఆర్.టి. నం.1239ను జారీ చేసింది. రాష్ట్రంలో సాంకేతిక విద్యను మరింత బలోపేతం చేయడం, పాలిటెక్నిక్ కోర్సులను ఆధునిక పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది.

సంప్రదాయ విద్యా విధానానికి, ప్రస్తుత పరిశ్రమ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ను ఏర్పాటు చేసింది. పరిశ్రమ ఆధారిత పాఠ్య ప్రణాళికలు, ప్రాక్టికల్ శిక్షణ, ఆధునిక ప్రయోగశాలలు, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు, మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడమే యూనివర్సిటీ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది.

ఇదే క్రమంలో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వ్యవస్థతో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం గతంలో జి.ఓ.ఎం.ఎస్. నం.97, తేదీ జూన్ 16, 2026ను జారీ చేసింది. పాఠ్య ప్రణాళికలు, మౌలిక వసతులను ఆధునీకరించడం, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడం, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లను విస్తరించడం, విద్యార్థులకు ఉద్యోగా-

మిగతాది 2 పేజీలో

## హైదరాబాద్‌లో ఘనంగా 'నృత్య–నృత్యతి' 15వ వార్షికోత్సవం

**భారతీయ శాస్త్రీయ నృత్య కళలకు వేదికగా జాతీయ నృత్యోత్సవం**



**హైదరాబాద్, ఆగస్టు 24 (వార్త సంధ్య) :** భారతీయ శాస్త్రీయ కళలను ప్రోత్సహించడంతో పాటు యువ, ఔత్సాహిక కళాకారులకు వేదిక కల్పించే 'నృత్యనృత్యతి' 15వ ఎడిషన్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఆగస్టు 22, 23 తేదీల్లో తెలంగాణ సారస్వత పరిషత్‌లో రెండు రోజుల పాటు జాతీయ నృత్యోత్సవం, పోటీలు నిర్వహించారు.

బెంగళూరుకు చెందిన నృత్యతి కళాక్షేత్రం ఆధ్వర్యంలో డాక్టర్ జి. రతీష్ బాబు,రాజ-

మిగతాది 2 పేజీలో

## తాజా వార్తలు

### పులివెందుల తాగునీటి పథకానికి ఊపిరి

– పవన్ కళ్యాణ్ చొరవతో వేగవంతమైన పనులు
– రూ. 280 కోట్లతో పునరుద్ధరణ చర్యలు
– 96 శాతం పనులు పూర్తి చేసిన అధికారులు
– లక్షల మందికి శాశ్వత తాగునీటి భరోసా



**కడప, ఆగస్టు 24 (వార్త సంధ్య):** పులివెందుల నియోజకవ-

మిగతాది 2 పేజీలో

## సింగరేణిని కాపాడుకుంటూ.. లాభాల బాటలో నడిపిస్తాం

### ఉప ముఖ్యమంత్రి బట్టి

**బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, లిథియం, క్రిటికల్ మినరల్స్ వైపు అడుగులు**

**ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**భట్టి సమర్థ నాయకత్వంలో సింగరేణి మరింత బలోపేతం: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 24 (వార్త సంధ్య):** తెలంగాణ రాష్ట్రానికి ఆత్మలాంటి అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు లాభదాయక సంస్థగా అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు.

సింగరేణి భవిష్యత్తుకు అవసరమైన బొగ్గు బ్లాక్‌లను సాధించడంతో పాటు సంస్థను మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్న భట్టి విక్రమార్కను సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లను సింగరేణి దక్కించుకోకపోవడం, ఉన్న గనులను మూసివేయడం

మిగతాది 7 పేజీలో

## తెలంగాణ హక్కులను కాలరాస్తున్న కేంద్రం: రేవంత్

**అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై సీఎం ఆగ్రహం**
**తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపణ**
**ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శ**



**హైదరాబాద్, ఆగస్టు 24 (వార్త సంధ్య):** అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి, విద్య, క్రీడలు, పెట్టుబడుల సాధన లక్ష్యంగా విదేశీ పర్యటనకు కార్యాచరణ రూపొందించుకుని, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశాంగ మంత్రిత్వ శాఖకు ముందుగానే సమర్పించినప్పటికీ అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించారని తెలిపారు.

సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనను తిరస్కరించడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నా-

మిగతాది 4 పేజీలో

## సంపాదకీయం

### అఖండ భారత్ – ఐక్యతే బలం

భారతదేశం అనేది కేవలం భౌగోళిక సరిహద్దులతో కూడిన దేశం కాదు. వేల సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, ఆధ్యాత్మిక విలువలతో ముడిపడిన మహోన్నత నాగరికత. విభజనలు ఎన్నో ఎదురైనా భారతీయుల హృదయాల్లో ఉన్న సాంస్కృతిక ఐక్యత చెదరలేదు. "అఖండ భారత్" అనే భావనను రాజకీయ విస్తరణగా కాకుండా, భారత ఉపఖండ ప్రజల మధ్య చారిత్రక, సాంస్కృతిక, మానవీయ బంధాలను గుర్తుచేసే ఆలోచనగా చూడాలి.

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశానికి ఉన్న అతి పెద్ద బలం. మతం, భాష, ప్రాంతం, కులం వంటి భేదాలను అధిగమించి దేశ సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. పొరుగు దేశాలతో శాంతి, స్నేహం, పరస్పర గౌరవం పెంపొందించుకోవడం కూడా ఈ భావనకు బలాన్నిస్తుంది.

అఖండ భారత్ ఆకాంక్ష కంటే ముందుగా అఖండ భారతీయ చైతన్యం అవసరం. దేశ ఐక్యత, సార్వభౌమత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ భవిష్యత్ తరాలకు బలమైన, సమగ్ర భారతదేశాన్ని అందించడమే మన నిజమైన లక్ష్యం.

(మొదటి పేజీ తరువాయి..)

# పులివెందుల తాగునీటి పథకానికి ఊపిరి

గ్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే



లక్ష్యంతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం వేగంగా పూర్తి దశకు చేరుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఈ పథకం పనులు పునరుద్ధరించబడి వేగవంతమయ్యాయి. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార పథకాల కింద భారీ నిధులు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్తున్నారు. ఏడు మండలాల పరిధిలో సుమారు ఐదున్నర లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో ఈ మెగా ప్రాజెక్టును ప్రారంభించారు. అయితే గత ప్రభుత్వ హయాంలో పనులు ఆశించిన స్థాయిలో సాగకపోవడంతో ప్రాజెక్టు పురోగతి మందగించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును ప్రాధాన్య అంశంగా గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టింది.

పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జల్ జీవన్ మిషన్ కింద నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం నుంచి లభించిన



అవకాశాలను వినియోగించుకుని ప్రాజెక్టు పూర్తి కోసం అవసరమైన నిధులు సమకూర్చారు. దాదాపు రూ. 280 కోట్లు ఈ పథకానికే కేటాయించి పనులను వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం పనుల్లో 96 శాతం పూర్తయ్యాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌లో 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తి చేశారు. పులివెందుల పట్టణం, పులివెందుల గ్రామీణ ప్రాంతం, సింహాద్రిపురం మండలాల్లో పనులు పూర్తవడంతో తాగునీటి సరఫరా అందుబాటులోకి వచ్చింది. లింగాల మండలంలోని 27 ఆవాసాల్లో 24 ఆవాసాలకు కూడా త్వరలో తాగునీటి సరఫరా ప్రారంభం కానుంది.

ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. 65 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఓవర్ హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం నీటి శుద్ధి కేంద్రాలకు సంబంధించిన కొన్ని తుది పనులు మాత్రమే మిగిలి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, పారిశుద్ధ్య రంగాలకు రాజకీయాలకు అతీతంగా ప్రాధాన్యం ఇవ్వాలన్న ప్రభుత్వ సంకల్పంతో ఈ పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే లక్షలాది మంది ప్రజలకు శాశ్వత తాగునీటి భరోసా లభించనుందని, ప్రాంత అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

# హైదరాబాద్‌లో ఘనంగా 'నృత్యనృత్యతి' 15వ వార్షికోత్సవం




శ్రీ దాస్ నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 150 మందికి పైగా కళాకారులు పాల్గొని భారతీయ శాస్త్రీయ నృత్యంలోని విభిన్న సంప్రదాయాలను ప్రదర్శించారు.

ఈ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరై కళాకారులను అభినందించారు. ముఖ్య అతిథులుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి దీపికా రెడ్డి, హైదరాబాద్ నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ పాల్గొన్నారు.

### అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు

సాయంత్రం జరిగిన కార్యక్రమాల్లో సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళైమామణి శ్రీమతి గోపికా వర్మ మోహినీయాట్టం రూపంలో సత్యభామ పాత్రను ప్రదర్శించారు. పద్మశ్రీ దీపికా రెడ్డి శిష్యులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు.

డాక్టర్ జి. రతీష్ బాబు (భిలాయ్), బిజుల బాలకృష్ణన్ (కోజికోడ్), రాజశ్రీ దాస్ (బెంగళూరు) కలిసి రూపొందించిన ప్రత్యేక కూచిపూడి ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.అలాగే హైదరాబాద్‌కు చెందిన శ్రీమతి ప్రసిద్ధ వయోలిన్ వాద్య ప్రదర్శన, బెంగళూరుకు చెందిన శ్రీమతి అమృత జగం భరతనాట్యం, భిలాయ్‌కు చెందిన శ్రీమతి సౌమ్యా మీనన్ కూచిపూడి ప్రదర్శనలు కూడా ప్రేక్షకులను అలరించాయి.

### యువ కళాకారులకు ప్రోత్సాహం

15వ ఎడిషన్ ద్వారా ఇప్పటికే గుర్తింపు పొందిన కళాకారులతో పాటు అభివృద్ధి చెందుతున్న నృత్య కళాకారులు, యువ ప్రతిభావంతులు, విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా భారతీయ శాస్త్రీయ కళా సంప్రదాయాలను మరింత విస్తృతంగా ప్రోత్సహించే ప్రయత్నం కొనసాగిందని నిర్వాహకులు తెలిపారు.

భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంతో పాటు కొత్త తరంలోని కళాకారులను తీర్చిదిద్దడమే 'నృత్యనృత్యతి' ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది.

# పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన 'శివాలయం' మూవీ

**భక్తి, ఆధ్యాత్మికత, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కుతున్న చిత్రం**

## సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం

**హైదరాబాద్, ఆగష్టు 24 (వార్త సంధ్య ):** తెలుగు వెండితెరపై మరో భక్తిరస చిత్రం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఆధ్యాత్మికత, భక్తి, భావోద్వేగాలను మేళవిస్తూ తెరకెక్కనున్న నూతన చిత్రం 'శివాలయం' పూజా కార్యక్రమాలతో తెలుగు ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఆచంట మహేష్ (రంగస్థలం ఫేమ్), కాంచన దీప్తిరెడ్డి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి వెంకట్‌రెడ్డి నంది దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దేవుని పటాల సమక్షంలో నిర్వహించిన ముహూర్తపు కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు, కళాకారులు, శ్రేయోభిలాషులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తొలి సన్నివేశానికి దిల్ రమేష్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ఘర్షణ శ్రీనివాస్ క్లాప్ కొట్టారు. ప్రముఖ వ్యవసాయవేత్త కళ్లెం నరసింహారెడ్డి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.



### మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం: లెంకల అశోక్ రెడ్డి

నటుడు, నిర్మాత లెంకల అశోక్ రెడ్డి మాట్లాడుతూ..
దర్శకుడు, నిర్మాత వెంకట్‌రెడ్డి గత ఆరు నెలలుగా చిత్ర ప్రీ-ప్రొడక్షన్ పనులను ఎంతో శ్రద్ధగా నిర్వహిస్తున్నారని తెలిపారు. దేవుడి నేపథ్యంలో తెరకెక్కే సినిమాలకు ప్రేక్షకుల నుంచి ఎప్పుడూ మంచి ఆదరణ ఉంటుందని, 'శివాలయం' కూడా మంచి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో తాను కూడా నటిస్తున్నానని, చిత్ర బృందం మొత్తాన్ని భగవంతుడు ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

### మంచి చిత్రాన్ని అందిస్తాం: దరిపల్లి ప్రవీణ్ కుమార్

సహనిర్మాత దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆశీస్సులతో దరిపల్లి అనంత రాములు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'శివాలయం' చిత్రంలో తనను భాగస్వామిని చేసి సహనిర్మాతగా అవకాశం కల్పించిన నందిరెడ్డి వెంకట్‌రెడ్డి, డ్రమ్స్ రాము వారికి కృతజ్ఞతలు తెలిపారు. 'వీరాభిమాని' మూవీతో డ్రమ్స్ రాముతో కలిసి ప్రారంభమైన తన ప్రయాణంలో ఇప్పుడు 'శివాలయం' చిత్రానికి సహనిర్మాతగా వ్యవహరిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. చిత్ర బృందం అంతా కలిసి ప్రేక్షకుల ముందుకు మంచి సినిమాను తీసుకురానున్నామని తెలిపారు.

### అద్భుతమైన టైటిల్: ఘర్షణ శ్రీనివాస్

నటుడు ఘర్షణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'శివాలయం' అనే టైటిల్ చాలా అద్భుతంగా ఉందన్నారు. శివుడి నేపథ్యంలో వచ్చిన పాటలు, కథాంశంతో రూపొందిన చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించిందని తెలిపారు. మంచి కథ, బలమైన భావోద్వేగాలతో 'శివాలయం' తెరకెక్కుతోందని, ఈ చిత్రంలో భాగం కావడం ఆనందంగా ఉందన్నారు. వెంకట్‌రెడ్డి నందికి ఇది 11వ సినిమా అని, తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. 'శివాలయం' ఘన విజయం సాధించి చిత్ర యూనిట్‌లోని ప్రతి ఒక్కరికీ మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### శివుడి లీలలను ఆవిష్కరించే చిత్రం: వెంకట్‌రెడ్డి నంది

చిత్ర దర్శకుడు, నిర్మాత వెంకట్‌రెడ్డి నంది మాట్లాడుతూ.. శివుడి లీలలు, మహిమలు, భక్తి భావనను ప్రేక్షకులకు ఆవిష్కరించాలనే ఉద్దేశంతో 'శివాలయం' చిత్రానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కథపై ఎంతో కాలంగా కసరత్తు చేస్తున్నామని, గత ఆరు నెలలుగా ప్రీ-ప్రొడక్షన్ పనులను పూర్తి స్థాయిలో నిర్వహించామని చెప్పారు. భక్తితో పాటు మంచి కథ, భావోద్వేగాలు, వినోదాన్ని ప్రేక్షకులకు అందించేలా సినిమాను రూపొందించనున్నట్లు తెలిపారు. వచ్చే సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని వెల్లడించారు. సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక అంశాలు, షూటింగ్ వివరాలను త్వరలో అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు.

**నటీనటులు:** ఆచంట మహేష్ (రంగస్థలం ఫేమ్), కాంచన దీప్తిరెడ్డితో పాటు ఘర్షణ శ్రీనివాస్, లెంకల అశోక్ రెడ్డి, మురం రెడ్డి వెంకటేశ్వర్లు, కుప్పిలి శ్రీనివాస చారి, మధుమతి కొక్కంటి, ముత్యాల ఉమా, చిట్టిబాబు, దిల్ రమేష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

### సాంకేతిక బృందం

నిర్మాత, దర్శకుడు: వెంకట్‌రెడ్డి నంది
సహనిర్మాతలు: దరిపల్లి ప్రవీణ్ కుమార్, లెంకల అశోక్ రెడ్డి
సంగీతం: డ్రమ్స్ రాము
కోరియోగ్రఫీ: నిహారిక చౌదరి

# పాలిటెక్నిక్ విద్యా ఆధునీకరణకు తెలంగాణ ప్రభుత్వం హై లెవల్ కమిటీ

లతో పాటు ఉన్నత విద్యా అవకాశాలను మెరుగుపరచడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి.

అయితే ప్రతిపాదిత సంస్థాగత మార్పులపై విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, ఇతర భాగస్వాముల నుంచి పలు ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుత డిప్లొమా విధానం, ఈసెట్ , లేటరల్ ఎంట్రీ అవకాశాలు, ఫీజుల నిర్మాణం, ఉద్యోగుల సర్వీస్ కండిషన్లు, సంస్థల గుర్తింపు, ప్రస్తుతం ఉన్న సాంకేతిక విద్యా సంస్థల పాత్ర వంటి అంశాలపై స్పష్టత అవసరమని వారు పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ విద్యను ఆధునీకరించడంతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, ఇతర భాగస్వాముల చట్టబద్ధమైన విద్యా, ఉద్యోగ, వృత్తిపరమైన ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## కమిటీ సభ్యులు

ప్రభుత్వ ప్రజా వ్యవహారాల సలహాదారు కె. కేశవరావు అధ్యక్షతన ఈ హై లెవల్ కమిటీ పనిచేయనుంది. కమిటీ సభ్యులుగా ప్రొఫెసర్ ఎం. కోదండరాం, ప్రొఫెసర్ శాంతా సిన్హా, నవీన్ మిట్టల్, ఐఏఎస్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ, ప్రభుత్వ కార్యదర్శి, శక్తి శాఖతో పాటు సాంకేతిక విద్యా కమిషనర్ సభ్య కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

కమిటీ అన్ని సంబంధిత వర్గాలతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు నిర్వహించి, సమస్యలను సమగ్రంగా పరిశీలించనుంది. పాలిటెక్నిక్ విద్యను ముందుకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన మార్గంపై స్పష్టమైన సిఫారసులను 30 రోజుల్లోగా ప్రభుత్వానికి సమర్పించాలని ప్రభుత్వం కమిటీని ఆదేశించింది.

# 22ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: మంత్రి పొంగులేటి

**అబద్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు**

**ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**22ఏ దరఖాసు లు ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరించాం - 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి..**

**22ఏలో లక్షల ఎకరాలు చేర్చారన్నది అవాస్తవం**

**ఎంత భూమి.. ఎందుకు 22ఏలో ఉందో రికార్డులతో మీడియా ముందు ఉంచుతున్నాం**

**తప్పు జరిగితే సరిదిద్దుతాం.. అక్రమమైతే చర్యలు**

**నకిలీ జీఓలు.. బోగస్ మెమోలు.. ఫేక్ సర్టిఫికెట్లతో భూదందాలు**

**అక్రమార్కులపై క్రిమినల్ కేసులు**

**ప్రభుత్వ భూమిని ప్రైవేట్‌గా చూపిస్తే సహించం**

**యుఎల్‌సీపై త్వరలో విధాన నిర్ణయం**

**ప్రధాన ప్రతిపక్షం కోరితే CS-7, CS-14 భూ వ్యవహారంపై సెట్ దర్యాప్తు**

**రిజిస్ట్రేషన్ స్లాట్ రద్దుచేసుకున్న వారి సొమ్మును వారం రోజుల్లో చెల్లింపు**

**మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, ఆగస్ట్ 24 (వార్త సంధ్య ):** రాష్ట్రంలో 22ఏలో లక్షలాది ఎకరాలు చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, 2023 డిసెంబర్ 7 నాటికి ఉన్న పరిస్థితి, ప్రస్తుత పరిస్థితి, ఏ కేటగిరీ భూములు ఎంత మేర నిషేధిత జాబితాలో ఉన్నాయో పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచుతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 22ఎ పేరిట ప్రతిపక్షాలు అనవసర రాద్దాంతాన్ని సృష్టిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. 22ఎ పేరిట ఇంతవరకు వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని దీనిపై దుష్ప్రచారాలను నమ్మవద్దని కోరారు.

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటికి నిషేధిత జాబితాలో ఉన్న ఫారెస్ట్, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ప్రైవేట్ భూములు తదితర వివరాలను కేటగిరీల వారీగా మొత్తం వివరాలను మీడియాకు విడుదల చేశారు.

సోమవారం నాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రిగారు మాట్లాడుతూ.. లక్షలాది ఎకరాలు 22ఎలో పెట్టారని ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం కాదు.. ఎంత ఉంది, ఎందుకు ఉంది, ఎవరి భూమి, ఏ కారణంతో నిషేధిత జాబితాలో పెట్టారనే ప్రతి అంశాన్ని రికార్డులతో చెబుతాం. వాస్తవాలు ప్రజల ముందుకు వస్తే ఎవరు నిజం చెబుతున్నారో ప్రజలే నిర్ణయిస్తారు అన్నారు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు లేదా రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు మళ్లించకుండా కాపాడటం 22ఏ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు.

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రెండు రెవెన్యూ గ్రామాల్లో 122 ఎకరాలు, మరోచోట 400కు పైగా ఎకరాలు కలిపి సుమారు 522 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారాలను మంత్రి ఉదాహరణగా ప్రస్తావించారు. ఎన్నికలకు ముందు ఈ భూముల వ్యవహారం అప్పట్లో మీడియాలో కూడా చర్చకు వచ్చిందని, ప్రభుత్వ భూములను భారీ విస్తీర్ణాల్లో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించారు. ఇలాంటి భూములను నిషేధిత జాబితాలో పెట్టడం తప్పా ? ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు.

సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి రెవెన్యూ గ్రామంలో 1958కు ముందు అసైన్‌మెంట్ జరిగినట్లు చూపిస్తూ, సరైన ప్రభుత్వ రికార్డులు లేకుండానే భూములపై హక్కులు సృష్టించి దారదత్తం చేశారు.

హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లో సర్వే నంబర్ 403కు సంబంధించి సుమారు 1,280 ఎకరాల విస్తీర్ణం ఉండగా, అందులో కేవలం రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని మంత్రి తెలిపారు. గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు రికార్డులు అప్‌లోడ్ చేసే సమయంలో మొత్తం సర్వే నంబర్‌ను పేర్కొనడం వల్ల ముఖ్యమంత్రి గారి నివాసంతో పాటు తన నివాసం కూడా పీఓబీలో చేర్చారని దానిని గుర్తించి వెంటనే సరిచేశామని తెలిపారు.




సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో సర్వే నంబర్ 172 ప్రభుత్వ భూమి, 173 ప్రైవేట్ భూమి అని, 173 పేరుతో అనుమతులు తీసుకుని 172 ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టిన ఉదాహరణను మంత్రి వివరించారు."ప్రైవేట్ సర్వే నంబర్ పేరుతో అనుమతులు తీసుకుని ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తే.. ఆ ప్రభుత్వ భూమిని 22ఏలో పెట్టకూడదా? 173లో కాదు, 172 ప్రభుత్వ భూమిలో పెట్టాం. ప్రభుత్వ భూమిని కాపాడటం మా బాధ్యత." అని వివరించారు.




మేడ్చల్ జిల్లా పర్వతాపూర్ ప్రాంతంలో ప్రధాన రెవెన్యూ గ్రామం, దానికి అనుబంధ హ్యామ్లెట్‌కు ఒకే తరహా సర్వే నంబర్లు కేటాయించడం వల్ల భూ వివాదాలు తలెత్తాయని మంత్రి చెప్పారు. సర్వే నంబర్లను సక్రమంగా పునర్వ్యవస్థీకరించి, సమగ్ర సర్వే ద్వారా ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.

మహేశ్వరం మండలంలోని 22 ఎకరాల సర్వే నంబర్‌లో రెండు ఎకరాలను భూదాన్ భూమి ఉంటే మొత్తం 22 ఎకరాలకు పాస్‌బుక్ జారీ కావడం, భూదానం చేసిన రెండు ఎకరాలను ప్రత్యేకంగా గుర్తించడంలో సమస్య ఏర్పడడంతో మొత్తం 22 ఎకరాలను పీఓబీలో పెట్టడం జరిగిందన్నారు.

భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూముల విషయంలో రికార్డులను కేసుల వారీగా పరిశీలించి, వాస్తవ హక్కుదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నకిలీ జీఓలు, మెమోలు, అధికారుల సంతకాలతో బోగస్ పత్రాలు సృష్టిస్తున్న వ్యవహారాలను గుర్తించామని ఆమేరకు క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలిస్తున్నామన్నారు.

మేడ్చల్ జిల్లాలో 22-04-2026 తేదీతో జిల్లా కలెక్టర్ సంతకం చేసినట్లు చూపిస్తూ ఒక నకిలీ మెమోను, మరోచోట 02-06-2026 తేదీతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పేరుతో బోగస్ సర్టిఫికెట్‌ను సృష్టించి రిజిస్ట్రేషన్ కోరిన వ్యవహారాలను గుర్తించామని చెప్పారు. సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

రాష్ట్రంలో పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం ( అర్బన్ ల్యాండ్ సీలింగ్ - యుఎల్‌సి) కి సంబంధించి కొద్దిరోజుల్లో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని మంత్రిగారు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో సి ఎస్ -7, సి ఎస్ -14కు సంబంధించి 2017లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి సంబంధించిన పత్రిక ఎండి ఒక భూస్వామి నుంచి ఎస్ క్లాస్ బెంజి కారు తీసుకొని 5 డాక్యుమెంట్ల ద్వారా 811 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న అంశంపై ప్రధాన ప్రతిపక్షం కోరితే సెట్ దర్యాప్తునకు ఆదేశిస్తామని చెప్పారు.

రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్, మేడ్చల్-మల్కాజిగిరి ప్రాంతాల్లో యుఎల్‌సి క్లియరెన్స్‌కు సంబంధించిన సమస్యలను మంత్రి వివరించారు.యుఎల్‌సి క్లియర్ చేసుకున్న భూములకు సంబంధించిన జీఓలు, ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని, యుఎల్‌సికి దరఖాస్తు చేయని లేదా క్లియరెన్స్ పొందని భూములు నిషేధిత జాబితాలో ఉండటం సహజమేనని చెప్పారు. యుఎల్‌సి క్లియర్ చేసుకున్న వారికి ఇబ్బంది లేదు. అవసరమైన పత్రాలు అందిస్తే ప్రభుత్వం పరిశీలించి క్లియర్ చేస్తుంది. కానీ యుఎల్‌సి కూడా చేయించుకోకుండా ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములుగా చూపిస్తూ ప్రచారం చేయడం సరికాదని చెప్పారు.

22ఏ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చాయని మంత్రి తెలిపారు. రిపీటెడ్, ఓవర్‌ల్యాప్ కాల్స్ తొలగించిన తర్వాత 980 ప్రత్యేక ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వీటిలో 547 వ్యవసాయ భూములు, 433 వ్యవసాయేతర భూములకు సంబంధించినవని తెలిపారు.రంగారెడ్డి నుంచి 258, మేడ్చల్ నుంచి 149, సంగారెడ్డి నుంచి 82, కామారెడ్డి నుంచి 44, యాదాద్రి భువనగిరి నుంచి 40, సిద్దిపేట నుంచి 35 కాల్స్ వచ్చినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 22ఎపై కొన్ని పత్రికల్లో వస్తున్నట్లుగా తీవ్ర సమస్య లేదని అన్నారు.

ఇప్పటికే రిలాక్సేషన్ పొందిన 22ఏ కేసుల్లో సుమారు 98 శాతం స్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు.సుమారు 300కు పైగా స్లాట్లలో దేవాదాయ, భూదాన్ తదితర కారణాలతో రిజిస్ట్రేషన్‌కు వీలు లేని 12-13 కేసులను మాత్రమే తిరస్కరించినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయిన వారికి ఈ వారాంతంలోపు ఆ మొత్తాన్ని తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 22ఏకు సంబంధించిన నిజమైన సమస్యలను 24 గంటల్లో, అవసరమైన సందర్భాల్లో గరిష్ఠంగా 36 గంటల్లో పరిష్కరించేలా ఫాస్ట్‌ట్రాక్ విధానం అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

ప్రజలను భయపెట్టడం మా ప్రభుత్వ విధానం కాదు.. ప్రజలకు భరోసా కల్పించడం మా బాధ్యత. ప్రభుత్వ భూములను కాపాడటం ఎంత ముఖ్యమో, న్యాయబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం" అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తాం.. ప్రతి రికార్డును ధృవీకరిస్తాం.. తప్పు జరిగితే సరిదిద్దుతాం.. అక్రమం జరిగితే చర్యలు తీసుకుంటాం. కానీ తప్పుడు ప్రచారంతో ప్రజలను భయాందోళనలకు గురి చేయడానికి మాత్రం ఈ ప్రభుత్వం అనుమతించదు అని అన్నారు.

సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ హక్కులను కాలరాస్తున్న కేంద్రం: రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి..)

యని ఆరోపించారు. రాష్ట్రాల సమాఖ్య సమాహారమే కేంద్ర ప్రభుత్వం అనే ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తిని గుర్తుంచుకోవాలని అన్నారు.

### తెలంగాణ రైజింగ్–2047 కోసం పర్యటన

తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యాలను ప్రపంచానికి పరిచయం చేయడం, అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేయడం, క్రీడా రంగానికి కొత్త అవకాశాలు తీసుకురావడం, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం కోసం అమెరికా పర్యటనను ప్రణాళికబద్ధంగా రూపొందించామని రేవంత్ రెడ్డి వివరించారు.

విదేశాంగ మంత్రిత్వ శాఖకు పర్యటనకు సంబంధించిన అన్ని వివరాలను అందించినప్పటికీ అనుమతి నిరాకరించారని, ఇందుకు గల రాజకీయ కారణాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

### గుజరాత్ సీఎంకు అనుమతి.. తెలంగాణ సీఎంకు ఎందుకు నిరాకరణ?

రాజకీయ కారణాలతో తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించిన రేవంత్ రెడ్డి.. అదే సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రికి ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడా పర్యటనలకు కేంద్రం అనుమతి ఇవ్వడాన్ని ప్రస్తావించారు. వైబ్రంట్ గుజరాత్ పేరుతో పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలకు అనుమతి ఇస్తున్నప్పుడు, తెలంగాణ రైజింగ్–2047 కోసం చేపట్టిన పర్యటనకు ఎందుకు అనుమతి నిరాకరించారని ప్రశ్నించారు. తన పర్యటనలో ఏవైనా అభ్యంతరకర అంశాలు ఉంటే ఇంగ్లాండ్ పర్యటనకు కూడా అనుమతి ఇవ్వకూడదని అన్నారు. ఒక దేశానికి అనుమతి ఇచ్చి మరో దేశానికి నిరాకరించడం వివక్షకు నిదర్శనమని విమర్శించారు.

### విద్య, క్రీడల కోసం అంతర్జాతీయ భాగస్వామ్యాలు అవసరం

విద్య, క్రీడల అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలు అవసరమని సీఎం పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహనీయులు విదేశాల్లో విద్యాభ్యాసం చేసి దేశానికి దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రపంచ స్థాయి విద్య, అవకాశాలు అందుబాటులోకి రావాలంటే విదేశీ విద్యా సంస్థలు, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలు అవసరమని తెలిపారు. ఈ లక్ష్యంతోనే విదేశీ పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. విదేశీ పర్యటనలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, తెలంగాణ భవిష్యత్తు కోసం చేపట్టిన కార్యక్రమాలని స్పష్టం చేశారు.

### మోదీపై సీఎం విమర్శలు

ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికీ గుజరాత్ నాయకుడిగానే వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. భారత ప్రధానిగా అన్ని రాష్ట్రాల పట్ల సమాన దృష్టితో వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు.

తన పర్యటనకు అనుమతి నిరాకరించడం వ్యక్తిగత అవమానం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమని వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి విదేశీ పర్యటనను అడ్డుకోవడం అంటే రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆరోపించారు.

ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు ఖండించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఎంపీలు ఈ విషయాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తారని తెలిపారు.

### తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను అడ్డుకోలేరు

తన విదేశీ పర్యటనను అడ్డుకోవచ్చేమోగానీ తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను మాత్రం అడ్డుకోలేరని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

డిసెంబర్ 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్య, క్రీడలు, పెట్టుబడుల రంగాల్లో ప్రపంచ స్థాయి భాగస్వామ్యాలను రాష్ట్రానికి తీసుకురావడానికి ఈ సదస్సు ద్వారా కృషి చేస్తామని వెల్లడించారు.

తెలంగాణ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణను ఎలాంటి అవరోధాలు నిలువరించలేవని, రాష్ట్ర ప్రయోజనాల సాధనలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## కేబీఆర్ పరిసరాల్లో ట్రాఫిక్ పరిస్థితుల పరిశీలన

- వన్‌వే విధానంపై ఉన్నతాధికారుల తనిఖీ
- వర్షాల నేపథ్యంలో వాహనాల రాకపోకల పర్యవేక్షణ
- ట్రాఫిక్ సిబ్బందికి కీలక ఆదేశాలు
- ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 24 (వార్త సంధ్య ):** కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాల్లో అమలు చేస్తున్న వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సమీక్షించారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 ప్రాంతంలో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించేందుకు ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పర్యటించారు. వన్‌వే విధానం అమల్లోకి వచ్చిన తర్వాత వాహనాల రాకపోకలు ఎలా ఉన్నాయనే అంశంపై అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంయుక్త పోలీసు కమిషనర్ (ట్రాఫిక్) డి. జోయెల్ డేవిస్, ట్రాఫిక్-2 డిప్యూటీ పోలీసు కమిషనర్ కాజల్ సింగ్ కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాలను సందర్శించారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో వాహనాల కదలికలను పరిశీలిస్తూ ట్రాఫిక్ నిర్వహణపై అధికారులతో చర్చించారు.
నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్ పరిస్థితులు మరింత ప్రభావితమయ్యే అవకాశం ఉండటంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వర్షపు నీటి నిల్వలు, రద్దీ పెరిగే ప్రాంతాలు, ప్రత్యామ్నాయ మార్గాల వినియోగంపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు సూచించారు. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ట్రాఫిక్‌ను వేగంగా క్లియర్ చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాల్లో అమలు చేస్తున్న వన్‌వే విధానం వల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతో పాటు ప్రయాణ సమయం తగ్గించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ సూచనలను



పాటిస్తూ నిర్ణయించిన మార్గాల్లోనే ప్రయాణించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేసేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. వర్షాలు, రద్దీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట అదనపు సిబ్బందిని మోహరించి సాఫీగా ట్రాఫిక్ సాగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

## వేములవాడలో లాడ్జీలపై ఆకస్మిక తనిఖీలు

- భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి
- సీసీ కెమెరాల పనితీరు పరిశీలన
- అనుమానితుల సమాచారంపై అప్రమత్తం

**వేములవాడ, ఆగస్టు 24 (వార్త సంధ్య):** వేములవాడ పట్టణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా పోలీసులు సోమవారం లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ వసతి గృహాలను సందర్శించిన పోలీసులు బసకు వచ్చిన అతిథుల వివరాలు, నమోదు ప్రక్రియ, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. నేర నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచే లక్ష్యంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల సందర్భంగా లాడ్జీలలో నిర్వహిస్తున్న అతిథుల రిజిస్టర్లను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. బసకు వచ్చే ప్రతి వ్యక్తి పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారా లేదా అన్న అంశంపై ఆరా తీశారు. ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా




పరిశీలించి, సంబంధిత వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు.
లాడ్జీలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా పోలీసులు తనిఖీ చేశారు. కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, రికార్డింగ్ వ్యవస్థలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. భద్రతా పరంగా సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, వాటి నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.
పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తుల వివరాల నమోదు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు కనిపించినా లేదా అనుమానాస్పద వ్యక్తులు లాడ్జీలలో బస చేసినట్లు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## వైద్య కళాశాల పోస్టుల భర్తీ ప్రక్రియ

- సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో ఎంపిక పరీక్ష
- 25 అధ్యాపక పోస్టులకు నియామకాల చర్యలు
- పారదర్శకంగా నిర్వహించిన ఎంపిక ప్రక్రియ
- అభ్యర్థుల నుంచి విశేష స్పందన

**జనగామ, ఆగస్టు 24 (వార్త సంధ్య ):** జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా సోమవారం ఎంపిక పరీక్ష నిర్వహించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని





ప్రధాన సమావేశ మందిరంలో జరిగిన ఈ పరీక్షకు అర్హులైన అభ్యర్థులు హాజరయ్యారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం ఈ ప్రక్రియ చేపట్టారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ 6, అసోసియేట్ ప్రొఫెసర్ 12, అసిస్టెంట్ ప్రొఫెసర్ 7 పోస్టులు కలిపి మొత్తం 25 ఒప్పంద ప్రాతిపదిక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ నియామకాల కోసం మొత్తం 13 దరఖాస్తులు అందగా, 10 మంది అభ్యర్థులు ఎంపిక పరీక్షకు హాజరయ్యారు.

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఎంపిక ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. నియామకాలు పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థుల అర్హతలు, ప్రతిభ ఆధారంగానే ఎంపికలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నాణ్యమైన వైద్య విద్య అందించాలంటే అధ్యాపకుల భర్తీ అత్యంత కీలకమని అధికారులు అభిప్రాయపడ్డారు.

ఖాళీల భర్తీతో విద్యార్థులకు మెరుగైన బోధన అందడంతో పాటు వైద్య కళాశాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగనున్నాయని తెలిపారు. వైద్య విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు అవసరమైన అధ్యాపక సిబ్బంది నియామకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఖాళీల భర్తీ ద్వారా విద్యార్థులకు ప్రయోజనం చేకూరడంతో పాటు వైద్య సేవల నాణ్యత కూడా మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. నాగమణి, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్. కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

వార్త సంధ్య

# ఘనంగా డాక్టర్ బాదావత్ రవి జన్మదిన వేడుకలు...

**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 24 (వార్త సంధ్య ):** మిషన్ వాక్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ బాదావత్ రవి జన్మదిన వేడుకలను సింగరేణి ప్రాంతంలో అభిమానులు, ఫౌండేషన్ టీమ్ సభ్యులు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. కేవలం సంబరాలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో ఈ వేడుకలను జరపడం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాగంగా మిషన్ వాక్ టీం ఆధ్వర్యంలో కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. అనంతరం వారికి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, సేవా స్ఫూర్తిని చాటుకోవడమే తమ లక్ష్యమని నిర్వహకులు స్పష్టం చేశారు.

కేక్ కట్ చేసిన జవాన్ దశరథ్

కారేపల్లి మెయిన్ సెంటర్‌లో టీమ్ సభ్యుడు గుగులోత్ నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జవాన్ దశరథ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ రవి మరిన్ని సంవత్సరాలు ప్రజా సేవలో ముందంజలో ఉండాలని అభిమానులు ఆకాంక్షించారు. అనంతరం కారేపల్లి సీఐ నూనావత్ సాగర్‌తో




పాటు పోలీస్ సిబ్బందిని మర్యాదపూర్వకంగా కలిసి స్వీట్లు అందజేశారు. ప్రజా భద్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు షరీఫ్, రాయల శ్రీనువాస్, హాట్కార్ రాంబాబు, బన్సీలాల్ , రాజాసింగ్, సాయి, అజయ్, రాంకీ బాలు ప్రవీణ్ పాటమ్మ నాగేంద్రబాబు శివ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీలో ప్రభుత్వ భూముల వేలాన్ని తక్షణమే నిలిపివేయాలి: ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్

**కూకట్‌పల్లి , ఆగస్టు 24 (వార్త సంధ్య) :** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) పరిధిలోని ప్రభుత్వ స్థలాల వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రభుత్వ భూముల వేలం విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలని ఎంపీ ఈటల సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాలు భూములను ప్రైవేట్ సంస్థలకు విక్రయించినా లేదా లీజుకు ఇచ్చినా.. స్థానిక ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటు ధరల్లో గృహాలను అందించడం వంటి ప్రజా ప్రయోజన నిబంధనలను అమలు చేసేవని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాంటి నిబంధనలను పక్కనబెట్టి, కేవలం తక్షణ ఆర్థిక అవసరాల కోసమే భూములను విక్రయించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు.



తరతరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వ స్థలాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న కూకట్‌పల్లి ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను పార్కులు, క్రీడా మైదానాలు, సీనియర్ సిటిజన్స్ క్లబ్‌హౌస్‌లు వంటి ప్రజా అవసరాలకే కేటాయించాలని స్పష్టం చేశారు. కూకట్‌పల్లి ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కోరారు. ప్రభుత్వ భూములను ప్రజల ఆస్తిగా భావించి, భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మారుతినగర్‌లో ఘనంగా తొట్టెల కార్యక్రమం

**హైదరాబాద్, ఆగస్టు 24 (వార్త సంధ్య ) :** బోనాల పండుగను పురస్కరించుకుని చైతన్యపురి డివిజన్ పరిధిలోని మారుతినగర్‌లో నిర్వహించిన తొట్టెల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి బోనాల పండుగ వేడుకల్లో



పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, నిఖిల్, సాయి, జలంధర్, పులి కిరణ్, నవీన్, శ్రావణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయొద్దు

**విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి**

**సర్టిఫికెట్లు నిలిపివేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: డా. చంటి ముదిరాజ్**



**హైదరాబాద్,ఆగస్టు 24 (వార్త సంధ్య):** ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం నుంచి ఆలస్యం అవుతున్నాయనే కారణంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, డిగ్రీ, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లను కళాశాలలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ డిమాండ్ చేసింది.

ఈ మేరకు కమిటీ జాతీయ ఛైర్మన్ డా. చంటి ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డిని కలిసి విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఆలస్యం అవుతున్న కారణంగా కొన్ని కళాశాలలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, డిగ్రీ/ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లను తమ వద్దే ఉంచుకుంటున్నట్లు కమిటీ దృష్టికి వచ్చిన విషయాన్ని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

## విద్యార్థులను బాధ్యులను చేయడం సరికాదు

ప్రభుత్వం–కళాశాలల మధ్య ఉన్న ఆర్థిక సమస్యలకు విద్యార్థులను బాధ్యులను చేయడం సరికాదని డా. చంటి ముదిరాజ్ అన్నారు. సర్టిఫికెట్లు అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.


విద్యార్థుల సర్టిఫికెట్లను వెంటనే విడుదల చేసేలా రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కమిటీ కోరింది. సర్టిఫికెట్లు నిలిపివేస్తున్న కళాశాలలపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

**"విద్యార్థి సర్టిఫికెట్ అతని భవిష్యత్తుకు తాళంచెవి. ఆర్థిక బకాయిల పేరుతో దాన్ని బందీ చేయకూడదు" అని డా. చంటి ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరవింద స్వామి, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.**

# ప్రత్యేక సమగ్ర సవరణలో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలి

## ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా సభలు: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 24 (వార్త సంధ్య ):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల




అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో గ్రామ, వార్డు సభల నిర్వహణపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌లో భాగంగా 27వ తేదీన అన్ని జిల్లాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితా, ఏఎస్‌డీ జాబితాలను బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్ల సమక్షంలో ప్రజలకు చదివి వినిపించాలని సూచించారు.

గ్రామ, వార్డు సభల నిర్వహణ సమయంలో బూత్ స్థాయి అధికారులు ఫారం-6, 7, 8లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని నమోదు చేయాలని ఆదేశించారు. అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన వివరాలను బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి సంబంధిత వ్యక్తులకు నోటీసులు అందించాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు ఏఈఆర్ఓల నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలను మరుసటి రోజులోగా పంపించాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.

## 3,355 నోటీసులు పెండింగ్

జిల్లా కలెక్టర్ సి.




నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియలో ప్రస్తుతం 3,355 నోటీసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించిన కార్యాచరణ ప్రకారం ఈ నెల 27న జిల్లాలోని గ్రామాలు, వార్డుల్లో సభలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అదనపు ఏఈఆర్ఓలకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ఇప్పటికే పంపించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.



# క్రమశిక్షణకు అందరూ కట్టుబడాలి : సీఎం

**– కొండా సురేఖ నోటీసులపై స్పందన**
**– పార్టీ వ్యవహారాలపై వ్యాఖ్యానించనన్న సీఎం**
**– నిర్ణయం క్రమశిక్షణా సంఘానిదే**

**హైదరాబాద్, ఆగస్టు 24 (వార్త సంధ్య):** రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసిన వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయని పేర్కొన్నారు. క్రమశిక్షణ విషయంలో ఎవరూ మినహాయింపు కాదనే సందేశాన్ని ఆయన ఇచ్చారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగా వ్యాఖ్యానించడం సరికాదని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణా సంఘం పరిశీలిస్తోందని, తగిన నిర్ణయం తీసుకునే బాధ్యత ఆ కమిటీదేనని స్పష్టం చేశారు. పార్టీ వ్యవహారాలు పార్టీ వేదికలపైనే చర్చించబడతాయని పేర్కొన్నారు.



ఇటీవల వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారాన్ని పార్టీ నాయకత్వం సీరియస్‌గా పరిగణించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణా సంఘం మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఘటనకు సంబంధించి వివరణ ఇవ్వాలని కోరింది. నోటీసు జారీ అనంతరం ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. షోకాజ్ నోటీసుకు మంత్రి కొండా సురేఖ ఇప్పటికే లిఖితపూర్వక సమాధానం సమర్పించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి తనను బాధ్యురాలిని చేయరాదని వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఈ వివరణపై క్రమశిక్షణా సంఘం పరిశీలన కొనసాగుతోంది. ఈ మొత్తం వ్యవహారంపై తుది నిర్ణయం పార్టీ క్రమశిక్షణా సంఘం తీసుకోనుంది. పార్టీ నియమ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు ఉంటాయని నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణకు ఇచ్చే ప్రాధాన్యతను మరోసారి స్పష్టం చేశాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# పాప్‌కార్న్ సాగుపై ఉపరాష్ట్రపతి ప్రశంసలు

**– తెలుగులో ప్రసంగించి ఆకట్టుకున్న రాధాకృష్ణన్**

**– పాప్‌కార్న్ ఉత్పత్తిలో రైతుల కృషికి అభినందనలు**

**– ఎగుమతుల్లో భారత్ ముందంజలో ఉండాలన్న పిలుపు**

**– నదుల అనుసంధానంపై ఆశాభావం**




**ఏలూరు, ఆగస్టు 24 (వార్త సంధ్య):** ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గ పరిధిలోని ముసునూరులో నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఉపరాష్ట్రపతి తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించి సభికులను ఆకట్టుకున్నారు. తనకు తెలుగు అర్థమవుతుందని, అయితే స్పష్టంగా మాట్లాడలేనని పేర్కొంటూ అందరినీ అభివాదం చేశారు. భారతదేశ సంస్కృతిలో వ్యవసాయానికి, పంటల పండుగలకు ఉన్న ప్రాధాన్యాన్ని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా జనవరి 14న జరుపుకునే పంటల పండుగను వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సంక్రాంతిగా, తమిళనాడులో పొంగల్‌గా, పంజాబ్‌లో లోహ్రీగా, అసోంలో బిహూగా జరుపుకోవడం భారతీయ సంస్కృతిలోని వైవిధ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.
దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో 17,500 మంది రైతులు సుమారు 40 వేల ఎకరాల్లో పాప్‌కార్న్ మొక్కజొన్న సాగు చేయడం అభినందనీయమని రాధాకృష్ణన్ అన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారని కొనియాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి ప్రపంచ మార్కెట్లలో పోటీ పడే సామర్థ్య ం భారత రైతులకు ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో విదేశాల నుంచి పాప్‌కార్న్ దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు మన దేశంలోనే నాణ్యమైన ఉత్పత్తి జరుగుతోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో అమెరికా వంటి దేశాలకు పాప్‌కార్న్‌ను ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదగాలని రైతులకు, పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.
రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని ఉపరాష్ట్రపతి చెప్పారు. వ్యవసాయంలో సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహించేందుకు డ్రోన్లను అద్దెకు అందించే పథకం కోసం కేంద్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.1,200 కోట్లు కేటాయించిందని వివరించారు. ఈ కార్యక్రమాలు రైతుల ఉత్పాదకత పెంపుతో పాటు ఖర్చులు తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దేశంలో నీటి వనరుల సమర్థ వినియోగం కోసం నదుల అనుసంధానం అవసరమని రాధాకృష్ణన్ అభిప్రాయపడ్డారు. మహానది నుంచి కావేరి వరకు నదులను అనుసంధానం చేసే ఆలోచన కేవలం కలగానే మిగిలిపోదని, కొంత సమయం పట్టినా భవిష్యత్తులో అది తప్పకుండా కార్యరూపం దాలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నీటి వనరుల సమన్వయంతో వ్యవసాయం, తాగునీటి అవసరాలు, ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.

# కేంద్రం ముందు రేవంత్ సర్కార్ మోకరిల్లింది : కల్వకుంట్ల కవిత

**ప్రీపెయిడ్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్ల ఏర్పాటు నిర్ణయం ఉపసంహరించుకోవాలి**



**హైదరాబాద్, ఆగస్టు 24 (వార్త సంధ్య) :** కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ముందు రేవంత్ రెడ్డి సర్కారు మోకరిల్లిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ఉచిత కరెంట్ ను ఎత్తివేసే కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు. సోమవారం ఈమేరకు వీడియో సందేశం రిలీజ్ చేశారు. అనంతరం పీపుల్స్ ప్లాజాలో టీజీఎస్పీడీసీఎల్ ఏర్పాటు చేసిన పవర్ ఎక్స్ పో – 2026ను సందర్శించి అక్కడ ప్రదర్శనకు ఉంచిన స్మార్ట్ మీటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంట్ ను దూరం చేయడంతో పాటు లాండ్రీ షాపులు, సెలూన్లకు ఉచిత కరెంట్ ఎత్తివేసే కుట్రలో భాగంగానే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పథకంలో భాగంగానే రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. గతంలో వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రయత్నం రేవంత్ సర్కారు చేసిందన్నారు. అదానీకి లాభం చేయడానికి కేంద్రం స్మార్ట్ మీటర్లు ప్రవేశ పెడుతుంటే రేవంత్ సర్కారు దానికి వంత పాడుతోందన్నారు. దీనిపై ప్రజల మైండ్ వాష్ చేసేందుకే పీపుల్స్ ప్లాజాలో ప్రదర్శన ఏర్పాటు చేసిందన్నారు.

ఈఆర్సీ వద్ద రైతులు గొడవ చేస్తే వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని చెప్పారని.. గృహ విద్యుత్ కనెక్షన్లకు మాత్రం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని ఇటీవల ట్రాన్స్ కో సీఎండీ చెప్పారని గుర్తు చేశారు. సెల్ ఫోన్ ముందస్తుగా రీచార్జ్ చేసుకున్నట్టుగా ఇకపై కరెంట్ కు ముందస్తు చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి స్మార్ట్ మీటర్లతో వస్తుందన్నారు. రీచార్జ్ ఎప్పుడు అయిపోతే అప్పుడు ఆటోమేటిక్ గా ఇండ్లలో కరెంట్ కట్ అవుతుందని చెప్పారు. యూపీలో స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్లు ఏర్పాటు చేస్తే ప్రజలు ఆగ్రహంతో వాటిని తొలగించి కరెంట్ ఆఫీసుల్లో పడేసి వెళ్తున్నారని అన్నారు. ఇప్పుడున్న మీటర్లతోనే కరెంట్ సరఫరా చేయాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ లు, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసి కరెంట్ సరఫరా బాగుండేలా చర్యలు చేపట్టాలని కోరారు. మన కరెంట్ ను అదానీ చేతుల్లో పెట్టే ప్రయత్నాలను ఇకనైనా విరమించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తెలంగాణ రక్షణ సేన వ్యతిరేకిస్తుందని.. ప్రజల కోసం ప్రజాక్షేత్రంలోకి వచ్చి ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

## అవినీతి అధికారులు సరే.. అవినీతికి మూలకారకుల సంగతేంది?

గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడి రూ.వేల కోట్లు కొల్లగొట్టిన అధికారుల గుట్టును ఏసీబీని ఉపయోగించి బయట పెడుతున్న ప్రభుత్వం ఆ అవినీతికి మూల కారకుల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఈమేరకు ఎక్స్ (ట్విట్టర్)లో సోమవారం పోస్ట్ పెట్టారు. గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు వందలు, వేల కోట్ల ప్రజాధనం దోచుకోవడానికి వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్న వారి సంగతి ఏమిటని ప్రశ్నించారు. అధికారులను ముందు పెట్టి రూ.వేల కోట్లు దోచుకుంటున్న వారి నుంచి ఆ అవినీతిని సొమ్ము కక్కించే వాళ్లు ఎవరు అని నిలదీశారు. అవినీతికి అధికారులను బాధ్యులను చేస్తున్నారని.. వారిని అడ్డుపెట్టుకొని వ్యవస్థలను దోపిడీ చేసే వారిని కట్టడి చేయాల్సిన వాళ్లెవరని ప్రశ్నించారు. తమకు మంచి చేస్తారని నమ్మి ప్రజలు అధికారం ఇస్తే భవిష్యత్ తరాలకు చెందాల్సిన సంపదను కొల్లగొడుతున్న వారిని చూస్తూ ఊరుకోవాలా అని నిలదీశారు. తన ప్రశ్నలపై పౌర సమాజం సీరియస్ గా చర్చించాలని విజ్ఞప్తి చేశారు.

# ‘ఫీజుల బకాయి – బీజేపీ లడాయి’

**రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు 48 గంటల నిరాహార దీక్ష ప్రారంభం**



**హైదరాబాద్, ఆగస్టు 24 (వార్త సంధ్య ):** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్ష హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రారంభమైంది. ‘ఫీజుల బకాయి – బీజేపీ లడాయి’ పేరుతో చేపట్టిన ఈ దీక్షకు విద్యార్థులు, బీజేపీ శ్రేణులు భారీగా తరలివచ్చి సంఘీభావం తెలిపారు.

తెలంగాణలో సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ పోరాటం చేపట్టామని బీజేపీ నేతలు తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో అనేక కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షల అవకాశాలను విద్యార్థులు కోల్పోతున్నారని పేర్కొన్నారు.

ధర్నా చౌక్ వద్ద దీక్షకు ప్రభుత్వం అనుమతి నిరాకరించినప్పటికీ వెనక్కి తగ్గకుండా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోనే రాంచందర్ రావు దీక్షకు కూర్చున్నారు. ఫీజు బకాయిల సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని పార్టీ స్పష్టం చేసింది.

దీక్షా కార్యక్రమంలో బీజేపీ ఎంపీ రేఖా శర్మ, బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, ఎంపీలు రఘునందన్ రావు, పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. గౌతం రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్, అధికార ప్రతినిధులు, పార్టీ పదాధికారులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వార్త సంధ్య

# ముడి హెరాయిన్ స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్

**– మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర సంస్థల భారీ దాడులు**

**– ఉత్తరప్రదేశ్‌లో 'ఆపరేషన్ బ్లాక్ హాక్' విజయవంతం**

**– అంతర్రాష్ట్ర ముఠా కార్యకలాపాలపై దర్యాప్తు ముమ్మరం**

**లక్నో, ఆగస్టు 24 (వార్త సంధ్య):** కేంద్ర మాదకద్రవ్యాల నియంత్రణ బ్యూరో (సీబీఎన్) మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ యూనిట్లు సంయుక్తంగా నిర్వహించిన 'ఆపరేషన్ బ్లాక్ హాక్'లో భారీ మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సమీపంలో వరుస దాడులు నిర్వహించి మొత్తం 18.64 కిలోల ముడి హెరాయిన్‌ను పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆపరేషన్ ద్వారా అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠాకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. ఈ కేసులో కీలక పాత్ర పోషిస్తున్న ముగ్గురు నిందితులను అధికారులు అరెస్ట్ చేశారు. వీరు వివిధ రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ మాదకద్రవ్యాల సరఫరా నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అరెస్టు చేసిన వ్యక్తుల నుంచి కీలక సమాచారం సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, ఈ ముడి హెరాయిన్ ఈశాన్య భారత రాష్ట్రాల నుంచి తరలించబడినట్లు గుర్తించారు. అక్కడి నుంచి రహస్య మార్గాల ద్వారా ఉత్తరప్రదేశ్‌కు తీసుకువచ్చి వినియోగదారులకు చేరవేయాలనే యత్నం జరిగినట్లు తెలుస్తోంది. అక్రమ రవాణా గొలుసులో మరికొందరి ప్రమేయం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకునేందుకు కేంద్ర సంస్థలు ఇటీవల ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టాయి. అదే క్రమంలో అనుమానాస్పద కదలికలను గుర్తించి ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న హెరాయిన్ అంతర్జాతీయ మార్కెట్లో భారీ విలువ కలిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. నిందితుల వద్ద నుంచి లభ్యమైన ఆధారాల ఆధారంగా అక్రమ రవాణా మార్గాలు, సరఫరాదారులు, కొనుగోలుదారుల వివరాలను గుర్తించే పనిలో దర్యాప్తు సంస్థలు నిమగ్నమయ్యాయి. ఈ ముఠా దేశంలోని మరికొన్ని రాష్ట్రాల్లో కూడా కార్యకలాపాలు నిర్వహించి ఉండవచ్చనే కోణంలో విచారణ కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో 'ఆపరేషన్ బ్లాక్ హాక్' మరో కీలక విజయంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించి భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక ఆపరేషన్లు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## భూసంరక్షణకు అంతర్జాతీయ నిధులపై భారత్ పిలుపు

**– కరువు నిరోధక చర్యలకు స్థిర ఆర్థిక సహకారం అవసరం**

**– మంగోలియాలో యూఎన్‌సీసీడీ సదస్సులో భారత్ ప్రతిపాదనలు**

**– హరిత ఆర్థిక నమూనాను వివరించిన భూపేందర్ యాదవ్**

**ఉలాన్‌బాటర్, ఆగస్టు 24 (వార్త సంధ్య ):** భూసంరక్షణ, కరువు నిరోధక చర్యల కోసం తగిన, స్థిరమైన, ముందస్తుగా అంచనా వేయగల అంతర్జాతీయ ఆర్థిక సహకారం అవసరమని భారత్ పునరుద్ఘాటించింది. మంగోలియాలోని ఉలాన్‌బాటర్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి ఎడారీకరణ నిరోధక కన్వెన్షన్ సదస్సు (యూఎన్‌సీసీడీ కాప్–17)లో భారత ప్రతినిధి బృందం ఈ అంశాన్ని బలంగా ప్రస్తావించింది. భూముల క్షీణత, కరువు ప్రభావాలను ఎదుర్కోవడంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు అంతర్జాతీయ మద్దతు మరింత అవసరమని పేర్కొంది. ఈ సదస్సులో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ప్రసంగిస్తూ భూసంరక్షణను వ్యయంగా కాకుండా భవిష్యత్తుపై పెట్టుబడిగా చూడాలని అన్నారు. ఆహార భద్రత, నీటి వనరుల పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, జీవనోపాధి అవకాశాల పెంపు, దీర్ఘకాలిక పర్యావరణ స్థిరత్వం కోసం భూసంరక్షణ అత్యంత కీలకమని



ఆయన వివరించారు. భూముల పునరుద్ధరణకు సంబంధించి భారత్ అమలు చేస్తున్న మిశ్రమ హరిత ఆర్థిక నమూనాను కూడా మంత్రి సదస్సులో ప్రస్తావించారు. ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను సమన్వయం చేస్తూ భూసంరక్షణ కార్యక్రమాలకు నిధులు సమకూర్చే విధానాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధిని సాధించే మార్గంగా ఈ నమూనా ఉపయోగపడుతుందని తెలిపారు. కరువు, భూముల క్షీణత వంటి సమస్యలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపుతున్నాయని భారత్ పేర్కొంది. ఈ సవాళ్లను ఎదుర్కోవాలంటే దేశాలు పరస్పర సహకారంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని సూచించింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతిక, ఆర్థిక సహకారం మరింత పెరగాలని కోరింది. భూముల పునరుద్ధరణ కార్యక్రమాల్లో స్థానిక సమాజాల భాగస్వామ్యం కీలకమని భారత ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులు, గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా కార్యక్రమాలు రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భూసంరక్షణ కీలక అంశమని భారత్ మరోసారి స్పష్టం చేసింది. భూముల పునరుద్ధరణ, కరువు నిరోధక చర్యలకు అంతర్జాతీయ స్థాయిలో దీర్ఘకాలిక ఆర్థిక మద్దతు లభిస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రపంచ ఆహార, నీటి భద్రత బలోపేతం అవుతుందని భారత్ అభిప్రాయపడింది.

## రైల్వే క్యాటరింగ్ సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి

**– ఐఆర్‌సీటీసీ వార్‌రూమ్‌ను సమీక్షించిన రైల్వే బోర్డు చైర్మన్**

**– ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కారానికి ఆదేశాలు**

**– వంటశాలల పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని సూచన**

**న్యూఢిల్లీ, ఆగస్టు 24 (వార్త సంధ్య):** రైల్వే ప్రయాణికులకు నాణ్యమైన ఆహార సేవలు అందించేందుకు రైల్వే బోర్డు చైర్మన్ ఐఆర్‌సీటీసీ వార్‌రూమ్‌ను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల అభిప్రాయ సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు వంటశాలల పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. రైల్వే క్యాటరింగ్ సేవల నాణ్యతను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



రైల్వే స్టేషన్లు, రైళ్లలో అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతర నిఘా అవసరమని ఆయన సూచించారు.

ముఖ్యంగా వంటశాలల్లో పరిశుభ్రత, ఆహార తయారీ ప్రమాణాలు, భద్రతా నిబంధనల అమలును ప్రత్యక్షంగా పర్యవేక్షించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. వంటశాలల్లో జరుగుతున్న కార్యకలాపాలను తక్షణ పర్యవేక్షణలో ఉంచేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించాలని సూచించారు. వంటశాలలలో కెమెరాల ద్వారా నిరంతర నిఘా, తనిఖీలు, నాణ్యత ప్రమాణాల పరిశీలన వంటి చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

## భారత్–మారిషస్ సహకారానికి మరింత బలం

**– ప్రజా పరిపాలన రంగంలో భాగస్వామ్యంపై చర్చలు**

**– కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌తో మారిషస్ మంత్రి భేటీ**

**– శిక్షణ, సామర్థ్య పెంపుపై సహకారం విస్తరణ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 24 (వార్త సంధ్య ):** మారిషస్ ప్రజా సేవలు, పరిపాలనా సంస్కరణల శాఖ మంత్రి లచ్‌మనాహ్ రాజ్ పెంధియా కేంద్ర సహాయ




మంత్రి జితేంద్ర సింగ్‌ను న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజా పరిపాలన, ఉద్యోగుల శిక్షణ, సామర్థ్య పెంపు కార్యక్రమాల్లో భారత్–మారిషస్ మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. పరిపాలనా రంగంలో పరస్పర అనుభవాలను పంచుకోవడం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించవచ్చని అభిప్రాయపడ్డారు. భేటీలో జితేంద్ర సింగ్ మాట్లాడుతూ భారత్, మారిషస్ దేశాల మధ్య చారిత్రక, సాంస్కృతిక, సామాజిక సంబంధాలు ఎంతో బలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉన్న అనుబంధం రెండు దేశాల భాగస్వామ్యానికి పునాదిగా నిలుస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజా పరిపాలన, సామర్థ్యాభివృద్ధి రంగాలు సహజంగానే మరింత సహకారానికి అవకాశం కల్పిస్తాయని అన్నారు. ప్రభుత్వ సేవల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్యోగుల శిక్షణ, ఆధునిక పరిపాలనా విధానాల అమలు, డిజిటల్ పాలన వంటి అంశాల్లో కలిసి పనిచేసే అవకాశాలను ఇరుపక్షాలు పరిశీలించాయి. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడంలో సాంకేతికత వినియోగం కీలకమని ఈ సందర్భంగా చర్చించారు. మారిషస్ మంత్రి లచ్‌మనాహ్ రాజ్ పెంధియా భారతదేశం ప్రజా పరిపాలన రంగంలో సాధించిన పురోగతిని ప్రశంసించారు. ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిపాలనా సంస్కరణల అమలులో భారత అనుభవం తమ దేశానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ రంగాల్లో మరింత సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. రెండు దేశాల మధ్య ఇప్పటికే కొనసాగుతున్న సహకార కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు అవసరమైన చర్యలపై కూడా చర్చ జరిగింది. ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణా కార్యక్రమాలు, అధ్యయన పర్యటనలు, నిపుణుల పరస్పర మార్పిడి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. భారత్–మారిషస్ సంబంధాలు సంప్రదాయ స్నేహబంధాన్ని దాటి వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చెందుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రజా పరిపాలన, సామర్థ్యాభివృద్ధి రంగాల్లో సహకారం పెరగడం ద్వారా ఇరు దేశాల పరిపాలనా వ్యవస్థలు మరింత బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు.

# ఏఐ నిర్ణయంతో డ్రైవర్ల ఖాతాలు నిలిపివేత.. ఉబర్‌కు రూ. 9,245 కోట్ల జరిమానా!

**న్యూఢిల్లీ, ఆగస్టు 24 (వార్త సంధ్య):** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా డ్రైవర్ల ఖాతాలను నిలిపివేసిన ఆరోపణలపై ఉబర్‌కు భారీ జరిమానా పడింది. నెదర్లాండ్స్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ ఉబర్‌పై 825 మిలియన్ యూరోల జరిమానా విధించింది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.9,245 కోట్లకు సమానం. యూరప్ జీడీపీఆర్ నిబంధనల కింద ఇప్పటివరకు విధించిన రెండో అతిపెద్ద జరిమానాగా ఇది నిలిచింది. డ్రైవర్లకు తగిన సమాచారం ఇవ్వకుండానే వారి ఖాతాలను డీయాక్టివేట్ చేసినట్లు నెదర్లాండ్స్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ ఆరోపించింది. ముఖ్యంగా కస్టమర్ల నుంచి తక్కువ రేటింగ్‌లు రావడం వంటి అంశాల ఆధారంగా కంప్యూటర్ ఆధారిత వ్యవస్థలు కొందరు డ్రైవర్ల ఖాతాలను శాశ్వతంగా నిలిపివేసినట్లు తెలిపింది. ఈ నిర్ణయాల్లో అర్థవంతమైన మానవ పర్యవేక్షణ లేదని నియంత్రణ సంస్థ పేర్కొంది. ఉద్యోగం, ఆదాయం వంటి అంశాలపై గణనీయమైన ప్రభావం చూపే నిర్ణయాలను పూర్తిగా ఆటోమేటెడ్ వ్యవస్థల ఆధారంగా తీసుకోకూడదని డచ్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ డిప్యూటీ ఛైర్ మోనిక్ వెర్డియర్ తెలిపారు. జీడీపీఆర్ నిబంధనల ప్రకారం ఇలాంటి నిర్ణయాల్లో మానవ పరిశీలనతో పాటు.. నిర్ణయాన్ని సవాలు చేసే అవకాశం కూడా ఉండాలని స్పష్టం చేశారు. అయితే నియంత్రణ సంస్థ ఆరోపణలను ఉబర్ ఖండించింది. ఆటోమేటెడ్ వ్యవస్థ ఆధారంగా మాత్రమే డ్రైవర్లను శాశ్వతంగా డీయాక్టివేట్ చేయలేదని పేర్కొంది. చాలా సస్పెన్షన్లు తాత్కాలికమైనవేనని, శాశ్వత తొలగింపులకు మానవ పరిశీలన ఉంటుందని తెలిపింది. నిర్ణయాన్ని సవాలు చేసే అవకాశం డ్రైవర్లకు కల్పిస్తున్నామని పేర్కొంటూ.. జరిమానాపై అప్పీల్ చేయనున్నట్లు ఉబర్ వెల్లడించింది. ఫ్రాన్స్‌లోని ఉబర్ డ్రైవర్ల ఫిర్యాదులతో ఈ వ్యవహారం మొదలైంది. మాజీ డ్రైవర్ బ్రహీమ్ బెన్ అలీ 2019లో తన ఖాతాను డీయాక్టివేట్ చేశారని ఆరోపించారు. అనంతరం సుమారు 170 మంది డ్రైవర్ల వాంగ్మూలాలను సేకరించి నెదర్లాండ్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ అంశంపై దర్యాప్తు చేపట్టిన నియంత్రణ సంస్థ తాజాగా భారీ జరిమానా విధించింది.




# శ్రీ రామ్ మందిర్ అయోధ్య ప్రసాద్' పేరుతో స్వీట్ల విక్రయం..

## అమెజాన్‌కు రూ. 1 లక్ష జరిమానా




**న్యూఢిల్లీ, ఆగస్టు 24 (వార్త సంధ్య) :** 'శ్రీ రామ్ మందిర్ అయోధ్య ప్రసాద్' పేరుతో సాధారణ స్వీట్లను విక్రయించేందుకు అనుమతించినందుకు అమెజాన్‌కు జరిమానా పడింది. సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) అమెజాన్ సెల్లర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై రూ.1 లక్ష జరిమానా విధించింది. సంబంధిత ఉత్పత్తులకు శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి అనుమతి ఉన్నట్లు ఆధారాలు లేవని సీసీపీఏ పేర్కొంది. అనుమతి లేకుండా సాధారణ స్వీట్లను 'శ్రీ రామ్ మందిర్ అయోధ్య ప్రసాద్' పేరుతో విక్రయించడం వినియోగదారులను తప్పుదోవ పట్టించే వాణిజ్య పద్ధతిగా సీసీపీఏ అభివర్ణించింది.

అంతేకాకుండా లక్షలాది మంది భక్తుల మతపరమైన మనోభావాలను దెబ్బతీసే అవకాశం ఉందని తెలిపింది. అమెజాన్ వంటి భారీ ఈ-కామర్స్ వేదికపై ఉత్పత్తుల జాబితా ఉండటం వల్ల వాటి ప్రామాణికతపై వినియోగదారుల్లో తప్పుడు నమ్మకం కలిగే అవకాశం ఉందని పేర్కొంది.

2024 జనవరి 22న అయోధ్యలో శ్రీరామ మందిర ప్రాణప్రతిష్ఠకు ముందు ఈ తరహా ఉత్పత్తులను అమెజాన్‌లో జాబితా చేసినట్లు సీసీపీఏ తెలిపింది. దీనిపై 2024 జనవరి 19న అమెజాన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయగా.. అనంతరం సంబంధిత లిస్టింగ్‌ను తొలగించింది. అయితే ఇలాంటి లిస్టింగ్‌లను ముందుగానే నిరోధించేందుకు ప్లాట్‌ఫామ్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని సీసీపీఏ స్పష్టం చేసింది. వినియోగదారుల రక్షణ చట్టం-2019, ఇ-కామర్స్ నిబంధనలు-2020 ప్రకారం తప్పుదోవ పట్టించే ప్రకటనలకు అమెజాన్‌ను బాధ్యురాలిగా నిర్ధారించిన సీసీపీఏ.. రూ.1 లక్ష జరిమానాను 15 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించింది. సంబంధిత సంస్థల ధ్రువీకరించిన అనుమతి లేకుండా ఏ మత సంస్థ లేదా ప్రముఖ ఆలయానికి సంబంధించిన ప్రసాదం, మహాప్రసాదం, భోగ్ వంటి మతపరమైన ఉత్పత్తులను ప్లాట్‌ఫామ్‌పై జాబితా చేయడం, ప్రచారం చేయడం లేదా విక్రయానికి అందుబాటులో ఉంచకూడదని అమెజాన్‌ను ఆదేశించింది. ఈ నిబంధనలు శ్రీ రామ్ జన్మభూమి ఆలయంతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీ మాతా వైష్ణో దేవి ఆలయం, శ్రీ కాశీ విశ్వనాథ ఆలయం, శ్రీ జగన్నాథ ఆలయం, శ్రీ కేదార్‌నాథ్, శ్రీ బద్రీనాథ్, శ్రీ సోమనాథ్, శ్రీ ద్వారకాధీష్, శ్రీ మహాకాలేశ్వర ఆలయాలకు వర్తించనున్నాయి.

# ఈ 7 సందర్భాల్లో క్రెడిట్ కార్డు వాడితే.. అప్పుల ఊబిలోకి!

**న్యూఢిల్లీ, ఆగస్టు 24 (వార్త సంధ్య):** నేటి డిజిటల్ యుగంలో క్రెడిట్ కార్డు వినియోగం సాధారణమైపోయింది. సరిగ్గా ఉపయోగిస్తే రివార్డు పాయింట్లు, క్యాష్‌బ్యాక్‌తో పాటు క్రెడిట్ స్కోర్ మెరుగుపడే అవకాశం ఉంటుంది. అయితే కొన్ని సందర్భాల్లో క్రెడిట్ కార్డును ఉపయోగించడం వల్ల అధిక ఛార్జీలు, వడ్డీలు చెల్లించాల్సి రావచ్చు. ముఖ్యంగా ఈ 7 సందర్భాల్లో క్రెడిట్ కార్డు వినియోగానికి దూరంగా ఉండటం మంచిది.

**ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా:** క్రెడిట్ కార్డుతో ఏటీఎం నుంచి నగదు తీసుకోవడం ఖరీదైన వ్యవహారం. సాధారణంగా క్యాష్ అడ్వాన్స్ ఫీజుతో పాటు నగదు తీసుకున్న సమయం నుంచే వడ్డీ వర్తించే అవకాశం ఉంటుంది. క్రెడిట్ కార్డు నిబంధనలను ముందుగా పరిశీలించకుండా నగదు విత్‌డ్రా చేయడం వల్ల అదనపు భారం పడుతుంది.




**పెట్రోల్ బంకుల్లో:**
క్రెడిట్ కార్డుతో ఇంధనం కొనుగోలు చేసినప్పుడు కొన్ని కార్డుల్లో ఫ్యూయల్ సర్‌ఛార్జ్ వర్తించవచ్చు. సర్‌ఛార్జ్ మినహాయింపు ఉన్న కార్డుల్లోనూ నిర్దిష్ట పరిమితులు, నిబంధనలు ఉండొచ్చు. కాబట్టి తరచుగా కార్డుతో ఇంధనం కొనుగోలు చేసే వారు తమ కార్డు ఛార్జీలను తెలుసుకోవాలి.

**డిజిటల్ వాలెట్లలో డబ్బు లోడ్ చేయడం:**
క్రెడిట్ కార్డు ద్వారా డిజిటల్ వాలెట్లలో నగదు జమ చేసేటప్పుడు కన్వీనియన్స్ ఫీజు, జీఎస్టీ వంటి అదనపు ఛార్జీలు వర్తించే అవకాశం ఉంది. తరచుగా ఇలా చేయడం వల్ల చిన్న మొత్తాలే అయినా కాలక్రమంలో ఎక్కువ ఖర్చవుతుంది.

**ఐఆర్‌సీటీసీలో టికెట్లు బుక్ చేయడం:** రైలు టికెట్లను క్రెడిట్ కార్డుతో బుక్ చేసేటప్పుడు సంబంధిత చెల్లింపు విధానం, కార్డు ఆధారంగా అదనపు ఛార్జీలు ఉండవచ్చు. బుకింగ్‌కు ముందు మొత్తం ఛార్జీలను పరిశీలించడం మంచిది. అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ చెల్లింపు విధానాలతో పోల్చి నిర్ణయం తీసుకోవాలి.

అనుమానాస్పద వెబ్‌సైట్లలో భద్రత లేకపోవడం లేదా అనుమానాస్పదంగా కనిపించే వెబ్‌సైట్లలో క్రెడిట్ కార్డు వివరాలను నమోదు చేయకూడదు. ఫిషింగ్ లేదా నకిలీ వెబ్‌సైట్ల ద్వారా కార్డు సమాచారం దొంగిలించే ప్రమాదం ఉంటుంది. ఆన్‌లైన్ చెల్లింపులకు విశ్వసనీయమైన వెబ్‌సైట్లనే ఎంచుకోవాలి.

**కార్డు బకాయిని మరో కార్డుతో తీర్చడం:**
ఒక క్రెడిట్ కార్డు బకాయిని మరో కార్డు ద్వారా తీర్చే ప్రయత్నం తాత్కాలిక ఉపశమనాన్ని ఇవ్వొచ్చు. అయితే బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ లేదా ఇతర సదుపాయాలకు ప్రాసెసింగ్ ఫీజులు, వడ్డీ వంటి ఖర్చులు ఉండవచ్చు. రుణభారం పెరగకుండా మొత్తం ఖర్చును ముందుగానే లెక్కించుకోవాలి.

**ఇప్పటికే భారీ ఈఎంఐలు ఉన్నప్పుడు:** హోమ్ లోన్, పర్సనల్ లోన్ లేదా ఇతర రుణాలపై భారీ ఈఎంఐలు చెల్లిస్తున్నప్పుడు అవసరం లేని క్రెడిట్ కార్డు ఖర్చులకు దూరంగా ఉండాలి. ఆదాయానికి మించి ఖర్చు చేయడం వల్ల బకాయిలు పేరుకుపోయి ఆర్థిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. క్రెడిట్ కార్డును సౌకర్యంగా మాత్రమే ఉపయోగించాలి.. అదనపు ఆదాయంగా భావించకూడదు.

# శ్రీలంకపై భారత్ ఆధిపత్యం

**కొలంబో ఆగస్టు 24 (వార్త సంధ్య):**
శ్రీలంక-భారత్ రెండో టెస్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 2 వికెట్ల నష్టానికి 8 పరుగులు చేసింది. భారత బౌలర్లు ఆరంభంలోనే లంకను దెబ్బతీశారు. లాహిరు కుమార 1, ప్రభాత్ జయసూర్య 2 పరుగులకే పెవిలియన్ చేరారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో వికెట్ తీశారు. దీంతో శ్రీలంక ఇంకా భారత్ కంటే 495 పరుగులు వెనుకంజలో ఉంది.
అంతకుముందు భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 503 పరుగుల వద్ద 9 వికెట్ల నష్టానికి డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ 117 పరుగులతో, ధ్రువ్ జురెల్ 115 పరుగులతో అజేయ శతకాలు సాధించి అదరగొట్టారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 50, రిషభ్ పంత్ 63 పరుగులతో అర్ధ శతకాలు నమోదు చేశారు. యశస్వి జైస్వాల్ 45, రవీంద్ర జడేజా 43 పరుగులతో రాణించారు.
భారత బ్యాటర్ల ధాటికి శ్రీలంక బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంకకు భారత బౌలర్లు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయిన శ్రీలంక.. భారీ లోటును పూడ్చుకోవాల్సిన పరిస్థితిలో నిలిచింది.




## మైనర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు.. జిమ్నాస్టిక్స్ కోచ్‌పై పోక్సో కేసు

**ముంబై, ఆగస్టు 24 (వార్త సంధ్య)** ద్రోణాచార్య అవార్డు గ్రహీత, 45 ఏళ్ల జిమ్నాస్టిక్స్ కోచ్ గణేశ్ ప్రభాకర్‌పై ముంబై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. 16 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలతో విలెపార్లే ప్రాంతానికి చెందిన బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది.

పోలీసుల సమాచారం ప్రకారం.. బాధితురాలు కొన్నేళ్లుగా జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ తీసుకుంటోంది. ఇంటి వద్ద చదువుకుంటున్న సమయంలో కోచ్ ఆమెకు వాట్సాప్‌లో 'హాయ్' అంటూ సందేశం పంపినట్లు తెలుస్తోంది. అనంతరం జిమ్నాసియంకు రావాలని, తనను కలిసేందుకు సమయం ఉందా అని కోచ్ అడిగినట్లు పోలీసులు తెలిపారు.

బాలిక జిమ్నాసియంకు వెళ్లిన సమయంలో అక్కడ ఒంటరిగా ఉన్న కోచ్ ఆమెను అసభ్యంగా తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొంది. అక్కడి నుంచి బయటపడిన బాలిక అనంతరం కాలేజీకి వెళ్లింది. ఆమె ముభావంగా ఉండటాన్ని గమనించిన పీఈటీ విషయం ఆరా తీయడంతో ఘటన వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.
పీఈటీ వెంటనే బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు విలెపార్లే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.




The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.